

అట్టుడికిన అనకాపల్లి



- లాఠీచార్జి చేసిన పోలీసులు.. రాళ్లు రువ్విన ఆందోళనకారులు
- ఉత్కంఠ రేపిన పోలీసుల మాబ్ ఆపరేషన్ డ్రిల్

- వార్త 7వ పేజీలో..

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- జిల్లాలో హాజరుకానున్న విద్యార్థులు 14,807 మంది

అనకాపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. దీనికి సంబంధించి జిల్లా ఇంటర్మీయట్ అధికారి, డీవీఈవో సుజాత వివరాలు వెల్లడించారు. జిల్లాలో అర్బన్ పరిధిలో నాలుగు, మండలాల్లో 16 కేంద్రాలతో కలిపి మొత్తం 20 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, అదే విధంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 9,326 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,481 మంది కలిపి మొత్తం 41,807 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్షల పర్యవేక్షణకు 20 మంది సూపరింటెండెంట్లతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్టు డీవీఈవో తెలిపారు.

పేలుడు సామగ్రి తయారీపై నిషేధం

- వచ్చే నెల 6 వరకు విక్రయాలు కూడా బంద్
- ఏఎస్పీ విజయభాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ విజయభాస్కర్

అనకాపల్లి రూరల్, మే 23: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో వచ్చే నెల ఆరో తేదీ వరకు జిల్లాలో ఎటువంటి పేలుడు సామగ్రి, పదార్థాలు తయారు చేయడం, విక్రయించడం, వాటిని ఉపయోగించడంపై నిషేధం విధించినట్టు ఏఎస్పీ విజయభాస్కర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాలోని పేలుడు పదార్థాల తయారీదారులు, పెట్రోల్ కంపెనీల సేల్స్ మేనేజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తయారీదారులు ఎటువంటి పేలుడు పదార్థాలను తయారు చేయరాదని, దానికి సంబంధించిన సామగ్రి, తయారు చేసిన వస్తువులు విక్రయించకూడదన్నారు. పెట్రోల్ విడిగా విక్రయించరాదని తెలిపారు. డీఆర్వో దయానిధి మాట్లాడుతూ ఊరేగింపులు, సంబరాలకు అనుమతులు లేవన్నారు. ఈ సమావేశంలో అగ్నిమాపక అధికారి రమణ, పెట్రోల్ కంపెనీల సేల్స్ మేనేజర్లు పాల్గొన్నారు.

కోట్లలో వ్యయం.. నీరుగారిన లక్ష్యం

ఆశించిన ఫలితాలనివ్వని జల్ జీవన్ మిషన్ పథకం

- చోడవరం వాసులకు తప్పని నీటి కష్టాలు
- గతంలోనే మేలని పలువురి ఆవేదన

చోడవరం, మే 23:

ఇంటింటికీ తాగునీరు అందించాలన్న లక్ష్యంతో రూ.13 కోట్లతో చేపట్టిన జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టు ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదన్న విమర్శలున్నాయి. గతంలోనే కొళాయిల ద్వారా నీరు సక్రమంగా అందేదని, ఈ ప్రాజెక్టు వల్ల కొళాయిల నుంచి సన్నటి ధార వస్తోందని, తమ నీటి అవసరాలు తీరడం లేదని పట్టణ వాసులు ఆవేదన చెందుతున్నారు.



జన్నవరం వద్ద పెద్దేరు నదిలో నిర్మించిన తాగునీటి పథకం బావి

చోడవరం పట్టణంలో సుమారు 20 వేలకు పైగా జనాభా ఉన్నారు. అయితే ఇంటింటికీ కొళాయి కోసం జల్ జీవన్ మిషన్ పథకం కింద నాలుగేళ్ల క్రితం రూ.13 కోట్లతో భారీ తాగునీటి పథకం మంజూరైంది. మండలంలోని జన్నవరం వద్ద పెద్దేరు నదిలో ఈ పథకం కోసం భారీ పంపు హౌస్ నిర్మించి అక్కడ నుంచి నీటిని లిఫ్ట్ చేసి జన్నవరం సమీపంలోని కొండపై ట్యాంకుకు పంపించి అక్కడ నుంచి జన్నవరం, అంకుపాలెం, శ్రీరాంపట్నం మీదుగా పైపుల ద్వారా చోడవరం పట్టణంలోని ట్యాంకులకు నీటిని సరఫరా చేయాలన్నది ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఈ పథకం కింద ఆరు వేల ఇళ్లకు కొళాయి కనెక్షన్లు కూడా ఇచ్చేశారు. తాగునీటి పథకం కూడా ఎన్నికల ముందు ప్రారంభించారు. అయితే ఇంటింటికీ కొళాయిల ద్వారా నీరు సరిగా రావడం లేదు. పది నిమిషాలు కూడా సరిగా నీరు రావడం లేదని, చాలా చోట్ల కొళాయిల ద్వారా బురదనీరు సరఫరా అవుతోందని పలువురు మహిళలు తెలిపారు.



ఇంటింటికీ కొళాయి ద్వారా వస్తున్న సన్నటి నీటి ధార

అవసరాల మేరకు అందని తాగునీరు

వాస్తవానికి పట్టణంలోని జనాభాకు రోజుకు సుమారు 20 లక్షల లీటర్ల వరకు నీరు అవసరం. కానీ ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏడు వాటర్ ట్యాంకులు కూడా కేవలం 12 లక్షల 50 వేల లీటర్లు ... మిగతా 8వ పేజీలో

పథకం నిర్వహణ బాధ్యత తీసుకుంటాం

ఈ పథకం నిర్వహణపరంగా పంచాయతీ సిబ్బంది పనితీరు ఆశించిన స్థాయిలో లేనందున, దీని నిర్వహణ బాధ్యతను మేం తీసుకోవాలని భావించి ఈ మేరకు అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. పథకం ద్వారా పూర్తిగా వాటర్ ట్యాంకులకు నీరు సరఫరా చేస్తే ఎలాంటి తాగునీటి సమస్యలు ఉండవు. ఇక పట్టణానికి ఉద్దేశించిన ఈ పథకం ద్వారా నీరు పూర్తిగా చోడవరానికి వచ్చేలా చర్యలు చేపట్టాం. ఇతర పంచాయతీల తాగునీటి అవసరాల కోసం వేరేగా బావి తవ్విస్తున్నాం. అది పూర్తయితే పథకం నీరు పూర్తిగా చోడవరానికే వస్తుంది.

- బి.శివకృష్ణ, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, చోడవరం

రెండు బిందెల నీరు కూడా రావడం లేదు



ఇంటింటికీ కొళాయి పేరుకే ఇంట్లో ఉంది. కానీ ఏనాడూ గట్టిగా రెండు బిందెలు కూడా రాలేదు. నీళ్ల కోసం పడిగాపులు కాయాల్సి వస్తున్నది. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కొల్లి లక్ష్మి, కోటవీధి, చోడవరం

నీళ్ల కోసం పాట్లు పడుతున్నాం



ఇంటింటికీ కొళాయి ద్వారా సక్రమంగా నీరు రావడం లేదు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా మార్పులేదు. రోజూ నీళ్ల కోసం పాట్లు తప్పడం లేదు. ఒక్కోసారి బురదనీరు వస్తున్నది. అధికారులు స్పందించి సక్రమంగా నీరు సరఫరా అయ్యేలా చూడాలి.

- ఆనాల దేవి, కోటవీధి, చోడవరం

పోలీస్ యంత్రాంగం అప్రమత్తం

జిల్లాలో 202 గ్రామాలపై ప్రత్యేక పోలీసు నిఘా

- ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమలు
- స్ట్రాంగ్ రూమ్ వద్ద కట్టుదిట్టమైన భద్రత



రాంబిల్లిలో పోలీసు గస్తీ (ఫైల్)

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయిన తరువాత కూడా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అల్లర్లు, హింసాత్మక సంఘటనలకు అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలో ఈనెల 13న జరిగిన పోలింగ్ సందర్భంగా చెదురుమదురు సంఘటనలు మినహా ఎటువంటి హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోలేదు. అయినా పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యల్లో భాగంగా జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

ఓట్ల లెక్కింపునకు ముందు, తరువాత ఎటువంటి అల్లర్లకు అవకాశం లేకుండా జిల్లాలో 24 మండలాల పరిధిలో పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడమే కాకుండా 202 గ్రామాల్లో వివాదాలు చోటు చేసుకొనే అవకాశాలున్నట్టు గుర్తించి ఆయా గ్రామాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు పోలీసు నిఘా కొనసాగనుంది. జిల్లాలో 30 పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. ఎటువంటి పత్రాలు లేని వాహనాలను నడుపుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు.

నో ఫ్లయింగ్ జోన్‌గా స్ట్రాంగ్ రూమ్ పరిసరాలు




ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ పరిసరాలను నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించాం. పారా మిలటరీ బలగాలు, ఆర్మ్‌డ్ రిజర్వుడ్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులను నియమించి 24 గంటలూ స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడంచెల భద్రతతో పాటు పహారా ఏర్పాటు చేశాం. స్ట్రాంగ్ రూమ్ వున్న శంకరం గ్రామ పరిసరాల్లోని 100 మీటర్ల దూరంలో 90 మంది సాయుధ పోలీసుల పహారా నిరంతరాయంగా కొనసాగుతున్నది. ఈ ప్రాంతంలో డ్రోన్ కెమెరాల వినియోగాన్ని నిషేధించాం. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు శంకరంలో స్ట్రాంగ్ రూమ్ వున్న ప్రాంతానికి అనుమతి లేకుండా ఎవరూ ప్రవేశించే అవకాశం లేదు.

- కేవీ మురళీకృష్ణ, ఎస్పీ, అనకాపల్లి

భారీగా విద్యుత్ వినియోగం

ఎండలు మండిపోతుండడమే కారణం



- పెరుగుతున్న అప్రకటిత కోతలు
- నిర్వహణ పనుల కోసమేనంటున్న అధికారులు
- అధికారికంగా ఎక్కడా కోతలు విధించడం లేదని ప్రకటనలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎండలు మండిపోతున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. వాతావరణంలో మార్పులు వచ్చి వర్షాలు పడతాయనుకుంటే కనీసం సాయంత్రం పూట గాలులు కూడా వీయడం లేదు. ఒకటే ఉక్కపోత. తట్టుకోలేనంత వేడి. దీంతో విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగిపోయింది. సాధారణ డిమాండ్‌కు మించి వాడేస్తున్నారు. ఏసీల కొనుగోళ్లు పెరిగాయి. అంతా సాయంత్రం ఏడింటికే వాటిని ఆన్ చేస్తున్నారు. ఈ డిమాండ్‌కు తగ్గట్టుగా ఈపీడీసీఎల్ అధికారులు గత ఏడాదే ఎక్కడికక్కడ అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినా సమస్యలు తప్పడం లేదు. ఓవర్ లోడ్ వల్ల కొన్నిచోట్ల లైన్లు ట్రిప్ అవుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఫ్యూజులు పోతున్నాయి. ఎవరికి విద్యుత్ లేకపోయినా వెంటనే ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తుండడంతో ఆ ఏరియాలో మరమ్మతుల కోసం అందరికీ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఇలాంటివి సమస్యను బట్టి అరగంట నుంచి గంట సమయం తీసుకుంటున్నాయి. ఇలా అనేక ప్రాంతాల్లో రిపేర్ల కోసం ఆపుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నిర్వహణ పనులు పేరుతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. సాధారణంగా ఈ పనులు వర్షాలు పడే ముందు చేపడతారు. చెట్ల కొమ్మలను కొట్టడం వంటివి చేస్తారు.

అయితే ఇప్పుడు విద్యుత్ లోడ్‌ను తగ్గించడానికి ప్రత్యామ్నాయ విధానంగా ఈ నిర్వహణ పనులు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఒక్కో ఏరియాలో ఒక్కో రోజు ఆరు గంటలు విద్యుత్ నిలిపివేస్తే ఇతర ప్రాంతాలకు సర్దుబాటు చేయడానికి అధికారులు ఇలా చేస్తున్నారనే అనుమానాలు ఉన్నాయి. కారణాలేవైతేనేమి జిల్లాలో ప్రజలు కొన్ని గంటల పాటు విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్నారు.

విద్యుత్ వినియోగం (మిలియన్ యూనిట్లలో...)

తేదీ	2022	2023	2024
మే 15	28.100	31.376	28.763
మే 16	27.816	32.070	27.903
మే 17	25.981	32.371	28.377
మే 18	26.151	31.374	29.057
మే 19	23.008	31.473	28.743
మే 20	24.765	30.271	30.133
మే 21	26.060	31.450	30.631
మే 22	24.812	31.301	30.547

విశాఖపట్నం సర్కిల్‌లో రోజువారీ సగటు వినియోగం 28.364 మిలియన్ యూనిట్లు. కాగా బుధవారం 2.183 మి.యూనిట్లు అధికంగా ఉపయోగించారు. అంటే 20,18,300 యూనిట్లు ఎక్కువ వాడేశారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఇది తక్కువేనని, ఇంకా ఎక్కువ వినియోగించే రోజులు ముందున్నాయని అధికారులు చెబుతున్నారు.

ఎక్కడా విద్యుత్ కోతలు లేవు

విశాఖపట్నం సర్కిల్‌లో ఎక్కడా విద్యుత్ కోతలు లేవు. డిమాండ్‌కు సరిపడా విద్యుత్ అందిస్తున్నాము. నిర్వహణ పనులు, మరమ్మతుల కోసమే అక్కడక్కడ కొద్దిసేపు ఆపుతున్నాము. అంతకు మించి అధికారికంగా ఎక్కడా విద్యుత్ సరఫరా ఆపడం లేదు.

- మహేంద్రనాథ్, ఎస్ఈ, విశాఖ సర్కిల్

ఓటర్లకు డబ్బులు ఇచ్చారా?.. నొక్కేశారా?

నేతల తీరుపై అనుమానాలు

- ప్రధాన పార్టీల అభ్యర్థుల అంతర్మథనం
- ఎలమంచిలి నియోజకవర్గంలో జోరుగా చర్చ



అచ్యుతాపురం, మే 23:

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లకు డబ్బులు ఇచ్చారు. ఓటుకు రూ.1500 చొప్పున పంపిణీ చేయడానికి వైసీపీ, కూటమి అభ్యర్థులు తమ నేతలకు నగదును ముందుగానే చేరవేశారు. అయితే ఎంత మేర ఓటర్లకు ఇచ్చారు?, ఎంత వరకు నేతలు నొక్కేశారు? అనే విషయం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కొన్ని ప్రాంతాల్లో ఓటర్లకు డబ్బులు అందలేదని తెలిసి ఇరు పార్టీల నాయకులు కంగుతిన్నారు. దీనిపై వాస్తవాలు తెలుసుకునేందుకు పరిశీలన ప్రారంభించారు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఎన్నికల్లో భారీ స్థాయిలో డబ్బులు పంపిణీ చేశారు. గతంలో ఓటుకు రూ.500 ఇచ్చేవారు. మద్యం సంగతి సరే సరి. అయితే ఈసారి ఇరు పార్టీల అభ్యర్థులు ఓటుకు రూ.1500 చొప్పున పంపిణీ చేశారు. ఇందు కోసం ఇరు పార్టీల వారు పంచాయతీల్లో సర్పంచులతో పాటు తమ నాయకులకు ముందుగానే డబ్బులు చేరవేశారు. వీరు ఇంటింటికి వెళ్లి ఓటర్లు ఎంతమంది ఉంటే అన్ని రూ.1500 చొప్పున పంపిణీ చేయాలి. అయితే కూటమి నాయకులు కంటే అధికార పార్టీకి చెందిన వారు సక్రమంగా పంపకాలు చేయలేదనే చర్చ జరుగుతోంది. మండల కేంద్రమైన అచ్యుతాపురానికి పక్కనే (అనకాపల్లి రోడ్డు)లో ఉన్న వైసీపీ సర్పంచ్ అధికారంలో ఉన్న ఒక పంచాయతీపై బహిరంగంగానే చర్చ జరుగుతోంది. ఇక్కడ కాపు సామాజిక వర్గం వారికి ఎవరికీ వైసీపీ నాయకుడు డబ్బులు పంపిణీ చేయలేదు. వీరంతా కూటమి అభ్యర్థికి ఓట్లు వేశారని బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఇక సర్పంచ్ సామాజికవర్గానికి చెందిన వారే ఈ పంచాయతీలో అధికంగా ఉన్నారు. అయినప్పటికీ ఓటుకు రూ.500 చొప్పున పంపిణీ చేశారు. అయితే కూటమి అభ్యర్థి మాత్రం రూ.1500 పంపిణీ చేసినట్టు తెలిసింది. దీంతో ఓటర్లు తాము తీసుకున్న రూ.500 మర్నాడు తీసుకువెళ్లి వైసీపీ సర్పంచ్ ముఖానకొట్టారన్న చర్చ జోరుగా సాగుతోంది. ఇక అచ్యుతాపురాన్ని ... మిగతా 8వ పేజీలో



పూడిమడకలో ఓటరు స్లిప్‌పై వైసీపీ నాయకులు పంచాయతీ ముద్ర, సంతకం చేసిన దృశ్యం

ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

- ప్రశాంత వాతావరణంలో సాగేలా చూడాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చే నెల 4న జరగబోయే ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సాగేలా అన్ని వర్గాల ప్రజలు, పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి కోరారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అనకాపల్లి ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, వారి ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్ల లెక్కింపు శంకరంలోని ఎస్పీ కార్యాలయానికి సమీపంలో ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్ పరిధిలో పెందుర్తి నియోజకవర్గ ఓట్లు విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతాయన్నారు. కౌంటింగ్‌కు సంబంధించిన టేబుళ్ల ఏర్పాట్లను అభ్యర్థులు ముందుగా వచ్చి చూసుకోవచ్చని తెలిపారు. కౌంటింగ్ హాలులోకి ప్రవేశం, అసెంబ్లీ, పార్లమెంట్ కౌంటింగ్ ఏజెంట్ల నియామకాలు, పాస్‌ల జారీ వంటివి పార్టీల అభ్యర్థులు ఆర్వోతో చర్చించి పరిష్కరించుకోవాలని తెలిపారు. కౌంటింగ్‌కు హాజరయ్యే ఏజెంట్లు తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ జారీ చేసిన పాస్ పట్టుకొని మాత్రమే రావాల్సి ఉంటుందని గమనించాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు, ఇతరత్రా సిబ్బంది, అభ్యర్థులు కూడా కౌంటింగ్ హాలులోకి సెల్‌ఫోన్లు తీసుకు వెళ్లరాదన్నారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు జరగాలన్నారు. కౌంటింగ్ హాలులోకి పాసులు ఉంటేనే అనుమతిస్తారని, లోపలకు ప్రవేశించేవారు క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో జేసీ జాహ్నవి, డీఆర్వో దయానిధి, ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరామ్, ఆర్వోలు మనోరమ, గీతాంజలి, సత్యవాణి, అనకాపల్లి జిల్లాలో పార్లమెంట్, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల తరఫున ప్రతినిధులు, ఏజెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

పాఠశాలలకు పుస్తకాలు

ఉమ్మడి జిల్లాలో గల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 21,71,180 పాఠ్య పుస్తకాలు అవసరం

- ఇప్పటివరకూ 6,20,000 రాక
- మండలాలకు పంపుతున్న అధికారులు

విశాఖపట్నం, మే 23:

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు అవసరమైన పాఠ్య పుస్తకాలు గాజువాక ఆటోనగర్‌లో గల గోదాముకు చేరుకుంటున్నాయి. ఇక్కడ నుంచి అధికారులు పాఠశాలలకు పంపుతున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని 46 మండలాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒకటి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు 21,71,180 పుస్తకాలు అవసరం. అయితే ఇప్పటివరకూ గాజువాకలో గల జిల్లా పాఠ్య పుస్తక విక్రయ కేంద్రం గోదాముకు మూడో వంతు కంటే తక్కువ..కేవలం 6,20,000 వరకూ మాత్రమే వచ్చాయి. గత ఏడాది మిగిలిపోయినవి రెండు లక్షల వరకూ ఉన్నాయి. మొత్తం కలిపితే 8,20,000. ప్రస్తుతం వీటిని ఆర్టీసీ కార్గో సర్వీస్‌లలో అన్ని మండలాలకు పంపుతున్నారు. పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసేందుకు కార్గో సర్వీస్‌ను జిల్లా ఉప విద్యాశాఖాధికారిని స్వర్ణలత రెండు రోజుల క్రితం ప్రారంభించారు. ఇదిలావుండగా ఒకటి నుంచి ఏడో తరగతి వరకు (నాలుగో తరగతి మినహా) పాఠ్య పుస్తకాలు ప్రస్తుతం కార్యాలయానికి చేరాయి. ఇవి కూడా తక్కువగానే వచ్చాయి. ఈ వారంలోగా పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు వచ్చే అవకాశం ఉందని జిల్లా పాఠ్యపుస్తకాల డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఆయా పాఠశాలలు ఇచ్చిన ఇండెంట్ ఆధారంగా పాఠ్య పుస్తకాలు పంపుతున్నామన్నారు. కాగా ఈ ఏడాది 8, 9, 10 తరగతుల పాఠ్యపుస్తకాలు నేరుగా ఆయా మండలాల విద్యాశాఖాధి కారుల కార్యాలయాలకు చేర్చే విధంగా చర్యలు చేపడుతున్నారు. జూన్ 12వ తేదీ నాటికి విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలకు పంపిణీ చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.



విశాఖ ఆటోనగర్‌లోని జిల్లా పుస్తక విక్రయ కేంద్రం నుంచి ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను వివిధ పాఠశాలలకు తరలిస్తున్న దృశ్యం

క్రైం... crime news

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి



చినతల్లి (ఫైల్)

రోలుగుంట, మే 23: మండలంలోని అడ్డసరం పంచాయతీ శివారు నిందిపురంలో విద్యుదాఘాతానికి గురై పాము చినతల్లి అనే వృద్ధురాలు మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి వీచిన గాలులకు చెట్టు కొమ్మ విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో మంటలు వ్యాపించాయి. విద్యుత్ వైరు తెగి చినతల్లి ఇంటి సమీపంలో పడింది. మంటల భయంతో చినతల్లి ఇంట్లో నుంచి బయటకు రావడంతో ఆమె కాలుకు విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు పి.దేముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సురేశ్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతుడు రమణ (ఫైల్ ఫొటో)

కొత్తూరు, మే 23 : అనకాపల్లి మండలం రొంగలివానిపాలెం జంక్షన్ వద్ద ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించి అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్ హెచ్‌సీ సోంబాబు తెలిపిన వివరాలివి. విశాఖపట్నం జిల్లా పాత గోపాలపట్నానికి చెందిన యల్లబిల్లి రమణ (35) డాక్ యార్డులో సెక్యూరిటీ గార్డుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నాడు. గురువారం కుంచంగిలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చాడు. అక్కడి నుంచి కాయగూరలు కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంపై కూండ్రం వెళ్లి తిరిగి కుంచంగి వస్తుండగా, మార్గ మధ్యలో ఆర్‌వీపాలెం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొన్నాడు. తీవ్ర గాయాలకు గురైన అతనిని అనకాపల్లి ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. మృతుని భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

కౌంటింగ్ ఫీవర్

- ఎక్కడ చూసినా ఓట్ల లెక్కింపుపైనే చర్చ
- జూన్ నాలుగున హోటళ్లు, రిసార్టులకు డిమాండ్
- స్నేహితులతో కలిసి ఫలితాలు వీక్షించేందుకు ఏర్పాట్లు
- రూమ్‌ల అడ్వాన్సు బుకింగ్

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎక్కడచూసినా ఓట్ల లెక్కింపునకు సంబంధించిన చర్చే నడుస్తోంది. రాష్ట్ర శాసనసభతోపాటు పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వచ్చే నెల నాలుగో తేదీన వెల్లడి కానున్నాయి. ఏపీ అసెంబ్లీ ఎన్నికలపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో రకరకాల విశ్లేషణలు కొనసాగుతున్నాయి. పోలింగ్ తమకు అనుకూలంగా జరిగిందంటూ ఇటు కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ), అటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఎవరికి వారు ధీమా వ్యక్తంచేస్తున్నారు. వైసీపీ నాయకులైతే ఒకడుగు ముందుకువేసి వచ్చే నెల తొమ్మిదో తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విశాఖపట్నంలో ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని ప్రకటించారు. మరోవైపు తమ విజయం ఖాయమని కూటమి నేతలు విశ్వాసంతో ఉన్నారు. దీంతో ఎవరు విజయం సాధిస్తారో ఒక పట్టాన అంతుచిక్కడం లేదు. ఫలితాలపై బెట్టింగ్‌లు కూడా జోరుగానే జరుగుతున్నాయి. అయితే అత్యధికులు కూటమి మొగ్గు చూపుతుండడంతో 2:1 నిష్పత్తిలో పందాలు సాగుతున్నాయి. ఇదిలావుంటే ఎన్నికల ఫలితాలను గుర్తుండిపోయే రీతిలో వీక్షించాలని చాలామంది ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. స్నేహితులంతా కలిసి ఒకచోట ఉండి టీవీల్లో ఫలితాలను వీక్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకోసం నగర శివార్లలో రిసార్టులు, గెస్ట్‌హౌస్‌లతోపాటు నగరంలోని ప్రధాన హోటళ్లు, లాడ్జిల్లో రూమ్‌లను అడ్వాన్స్‌గా బుక్ చేసుకుంటున్నారు. జూన్ నాలుగు తేదీన రూమ్‌ల కోసం డిమాండ్ పెరిగిపోయింది. ఇప్పటికే శివారు ప్రాంతాల్లోని రిసార్టులు, బీచ్‌రోడ్డులోని గెస్ట్‌హౌస్‌లు, నగరంలోని పలు స్టార్ హోటళ్లలో రూమ్‌లు దాదాపు ఫుల్ అయిపోయినట్టు నిర్వాహకులు చెబుతున్నారు.

'పేట'లో పోలీసులు కార్డన్ సెర్చ్

- విస్తృతంగా తనిఖీలు
- రికార్డులు లేని 66 వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో డీఎస్పీ మోహన్, సీఐలు, ఎస్‌ఐలు

పాయకరావుపేట, మే 23 : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ త్వరలో జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా గురువారం తెల్లవారుజామున నర్సీపట్నం డీఎస్పీ ఆధ్వర్యంలో పాయకరావుపేట, నక్కపల్లి, నర్సీపట్నం టౌన్, రూరల్ సీఐలు, ఎస్‌ఐలు సిబ్బందితో కలిసి పాయకరావుపేటలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ కాలనీ, దుర్గాకాలనీలలో ఇంటింటినీ విస్తృతంగా తనిఖీలు చేశారు. సక్రమంగా రికార్డులు లేని 66 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పాయకరావుపేట సీఐ పి.అప్పలరాజు మాట్లాడుతూ వాహనాల యజమానులు సరైన రికార్డులు చూపించి, తమ వాహనాలను తీసుకు వెళ్లవచ్చునన్నారు.

అల్లూరిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

- సీతమ్మవారి కొండను అభివృద్ధి చేయాలి
- అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు 'పడాల'



అల్లూరి విగ్రహం వద్ద వీరభద్రరావు తదితరులు

పాయకరావుపేట రూరల్, మే 23: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు అన్నారు. మండలంలోని సీతమ్మవారి కొండను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు చరిత్రలో ప్రధానమైన నాలుగు సంవత్సరాల పాటు తపస్సు చేసిన గోపాలపట్నం సీతమ్మవారి కొండను ప్రభుత్వం అభివృద్ధి చేయాలన్నారు. ఈ కొండపై వెలసిన ఉమాధర్మలింగేశ్వరస్వామిని, దుర్గాదేవిని దర్శించుకోవడానికి నిత్యం భక్తులు వస్తుంటారన్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన సీతమ్మ వారి కొండ ఆలయం అభివృద్ధిపై దృష్టి సారించి, రోడ్డును కూడా నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షురాలు వాడపల్లి వెంకటరమణమ్మ, కార్యదర్శి లక్కాకుల బాబ్జీ, జైబాబు, శివాజీ రాజు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	133.00
లైవ్ ధర	153.00
విత్ స్కిన్	276.00
స్కిన్ లెస్	286.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

అట్టుడికిన అనకాపల్లి

పోలీసులకు వ్యతిరేకంగా నిరసన గళాలు

- లాఠీచార్జి చేసిన ఖాకీలు .. రాళ్లు రువ్విన ఆందోళనకారులు
- టీయర్ గ్యాస్ ప్రయోగం, గాల్లోకి కాల్పులు
- ఈ దృశ్యాలను చూసిన పట్టణవాసుల్లో భయం..భయం..
- చివరకు పోలీసు శాఖ మాక్ ఆపరేషన్ డ్రిల్ అని తెలిసి ఊపిరి పీల్చుకున్న జనం



నెహ్రూచౌక్‌లో పోలీసులపై రాళ్లు రువ్వుతున్న ఆందోళనకారులు

అదో రద్దీ ప్రదేశం.. ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉన్నారు. సాయంత్రం నాలుగున్నర గంటలైంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా ప్లకార్డులు చేతబట్టి ఆందోళనకారులు రోడ్డెక్కారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఖాకీలు సైతం సంయమనం పాటించాలని మైక్ ద్వారా సూచించారు. అయినా వారు వెనక్కితగ్గలేదు. చేసేది లేక ఇట్నుంచి పోలీసులు లాఠీచార్జి చేసి చెదరగొట్టగా, అట్నుంచి ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. ఆ తరువాత అక్కడ చిన్నపాటి రణరంగంగా మారింది. పట్టణం నడిబొడ్డున గురువారం సాయంత్రం చోటుచేసుకున్న భయానక దృశ్యాలివి. తమ కళ్లముందు ఏం జరుగుతుందో తెలియక అక్కడివారంతా అవాక్కయ్యారు. కాసేపటి తరువాత ఇది పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరిగిన మాబ్ ఆపరేషన్ డ్రిల్ అని తెలుసుకుని అంతా ఊపిరి పీల్చుకున్నారు. గంటపాటు సాగిన ఈ కార్యక్రమం ఆద్యంతం అందరినీ ఆకట్టుకుంది.



గాలిలోకి కాల్పులు



వాటర్ ఫైరింగ్ ప్రయోగం

అనకాపల్లి టౌన్, మే 23 : హింసాత్మక సంఘటనలు జరిగినప్పుడు, పెద్దపెద్ద ఆందోళనలు చోటు చేసుకున్నప్పుడు ఆందోళనకారులను ఏ విధంగా చెదరగొట్టి.. శాంతిభద్రతలను పరిరక్షిస్తారో ప్రజలకు పోలీసులు కళ్లకు కట్టినట్టు చూపించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు గురువారం సాయంత్రం పట్టణంలోని నెహ్రూచౌక్‌లో జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు మాబ్ ఆపరేషన్ డ్రిల్ నిర్వహించారు. ముందుగా పోలీస్ సిబ్బంది సివిల్ దుస్తుల్లో ఆందోళనకారులుగా వ్యవహరించారు. 'పోలీసులు డౌన్ డౌన్, పోలీసుల జులుం నశించాలి' అని వీరు నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. దీంతో ఎన్నికల దృష్ట్యా ఎటువంటి ఆందోళనలకు దిగరాదని పోలీసులు మైక్‌లో హెచ్చరికలు చేసినా ఆందోళనకారులు వినిపించుకోకపోవడంతో ముందుగా లాఠీచార్జి చేసి చెదరగొట్టారు. ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో టీయర్ గ్యాస్ వదిలారు. వాటర్ పంపుల ద్వారా ఫైరింగ్ చేశారు. అయినప్పటికీ ఆందోళనకారులు లెక్కచేయక పోవడంతో గాల్లోకి కాల్పులు జరిపారు.



లాఠీచార్జి

ఈ ఘటనలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలకు గురికాగా, వెంటనే పోలీసులే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించిన సన్నివేశాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీస్ సిబ్బంది సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించడమే ధ్యేయంగా ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మాబ్ ఆపరేషన్ డ్రిల్‌లో పాల్గొన్న పోలీస్ సిబ్బందికి, ఫైర్ సర్వీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, అనకాపల్లి డీఎస్పీ ఎస్.అప్పలరాజు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, నర్సీపట్నం డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, ఎస్‌బీ డీఎస్పీ అప్పారావు, దిశ డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు, ట్రైనీ డీఎస్పీ భవ్య, ఇన్‌స్పెక్టర్లు మన్మథరావు, సతీష్, శంకరరావు, శ్రీనివాసరావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



పరిస్థితులను పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ తదితర పోలీసు ఆఫీసర్లు

రోడ్లు ఇలా.. ప్రయాణాలు ఎలా..?

రాంబిల్లి, మే 23:

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి రహదారుల దుస్థితి దర్పణంగా నిలుస్తోంది. ఓవైపు ఎక్కడికక్కడ రాళ్లు తేలడం..., మరో వైపు గుంతల మయం కావడంతో వీటిపై ప్రయాణం అంటేనే జనం హడలిపోతున్నారు. అందునా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారుల దుస్థితి మరీ దారుణంగా ఉంది. కనీసం మరమ్మతులైనా చపట్టండి మహాప్రభో.. అని పల్లె జనం వేడుకుంటున్నా చెవిన వేసుకునేవారు కరువయ్యారు. ఫలితంగా ఈ రహదారుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతూ పలువురు గాయాలకు గురవుతుండగా, వాహనాలు పాడవుతున్నాయని ఆయా యజమానులు గగ్గోలు పెడుతున్నారు.

- అస్తవ్యస్తంగా వెల్చూరు-పెదకలవలాపల్లి రహదారి
- రాళ్లు తేలి, గుంతలమయంగా మారడంతో రాకపోకలకు జనం అవస్థలు
- ఐదేళ్లుగా ఇదే దుస్థితి ఉన్నా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం



సంతపాలెం జంక్షన్ నుంచి వెల్చూరు మీదుగా పెదకలవలాపల్లి వెళ్లే రహదారి దుస్థితి



పెదకలవలాపల్లి వద్ద పూర్తిగా పాడైన రహదారి



మండలంలోని సంతపాలెం నుంచి వెల్చూరు మీదుగా పెదకలవలాపల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా శిథిలమైంది. దీంతో రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో నిత్యం వెల్చూరు, పెదకలవలాపల్లి, వై.లోవ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు మూడు కిలోమీటర్లు దూరం ఉన్న ఈ రోడ్డు గత ఐదు సంవత్సరాలుగా పూర్తిగా శిథిలమైంది. అడుగడుగునా భారీగా గోతులు పడి, రాళ్లు తేలాయి. రోడ్డు అంచులు సైతం కోతకు గురయ్యాయి. దీంతో తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాలు కురిసే సమయాల్లో ఈ రోడ్డుపై ప్రయాణం అంటే ప్రత్యక్ష నరకమనే చెప్పాలి. వర్షపు నీరు ఆయా గోతుల్లో చేరడంతో ఎక్కడ గొయ్యి ఉందో, ఎక్కడ రోడ్డు ఉందో గుర్తించలేని విధంగా ఉంటుంది. ఆ సమయంలో పాదచారులు సైతం అవస్థలు పడుతుంటారు. ఈ రోడ్డుపై పగటి పూట ప్రయాణం ఎలాగోలా చేయవచ్చునని, రాత్రి వేళ మాత్రం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లి వస్తున్నామని పైమూడు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రహదారి నిర్మాణం మాట అటుంచితే, కనీసం మరమ్మతులైనా చేపట్టండి మహాప్రభో అని వేడుకుంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారని గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం వేసవి కాలంలో కావడంతో రహదారుల మరమ్మతులు చేపట్టడానికి ఇదే సరైన సమయమని, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని అంతా కోరుతున్నారు.

తారెత్తించిన భానుడు

నిర్మానుష్యంగా మారిన రహదారులు

కె.కోటపాడు, మే 23: మండల కేంద్రమైన కె.కోటపాడు, పరిసర ప్రాంతాల్లో గురువారం భానుడు తారెత్తించాడు. ఉదయం ఎనిమిది గంటల నుంచే సూరీడు ప్రతాపం చూపడంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు బెంబేలెత్తిపోయారు. సాయంత్రం ఐదు గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగింది. ఎండ వేడిమి తీవ్రంగా ఉండడంతో ఉదయం పదకొండు గంటలకల్లా ప్రధాన రహదారులన్నీ బోసిపోయాయి. ఎండకు తోడు వేడి గాడ్పులతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గత ఐదు రోజులుగా భానుడు ప్రతాపాన్ని మరింత అధికంగా చూపిస్తుండడంతో నిత్యం రద్దీగా ఉండే కె.కోటపాడు మూడు రోడ్ల కూడలితో పాటు మండలంలోని పలు రహదారులన్నీ బోసిపోయాయి. అత్యవసర పనులుంటే తప్ప ఎవరూ బయటకు వచ్చేందుకు సాహసించలేదు. అత్యధిక శాతం ప్రజలు ఇళ్లకే పరిమితమవ్వడంతో వ్యాపార సముదాయాలన్నీ వెలవెలబోయాయి.



నిర్మానుష్యంగా ఉన్న మాడుగుల ఘాట్ రోడ్డు జంక్షన్



పెద్దగా జనసంచారం లేని కె.కోటపాడు మూడు రోడ్ల కూడలి

సూరీడు ప్రతాపం నుంచి రక్షణ పొందేందుకు టార్పాన్ల కింద తలదాచుకున్నారు. అయితే ఒకపక్క ఎండ, మరోపక్క వడగాల్పులతో సాయంత్రం వరకూ అవస్థలు పడ్డారు. కాగా మండలంలో శిరిజాం గ్రామానికి చెందిన కుమ్మరి కార్మికులు తాము తయారుచేసిన కుండలను గురువారం కోనాం సంతకు తీసుకువచ్చినప్పటికీ కొనుగోలుదారులు రాకపోవడంతో తీవ్ర నిరాశతో వాటిని తీసుకుని ఇంటి ముఖం పట్టారు.

వెలవెలబోయిన కోనాం సంత

చీడికాడ: గత వారం రోజులుగా మండుతున్న ఎండలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భానుడు కన్నెర్ర చేయడంతో జనం విలవిల్లాడుతున్నారు. గురువారం మండలంలోని కోనాంలో జరిగిన వారపు సంతకు జనం లేకపోవడంతో చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా కోనాం ఏజెన్సీతో పాటు ఐటీడీఏ గ్రామాల నుంచి గిరిజనులు పండించిన అటవీ ఉత్పత్తులను ఉదయం ఆరు గంటలకే తీసుకువచ్చిన గిరిజనులు ఏడు నుంచే ఎండ వేడిమి ప్రారంభం కావడంతో వ్యాపారులు అడిగిన ధరలకే సరకులను విక్రయించి తొమ్మిది గంటలకల్లా స్వగ్రామాలకు వెళ్లిపోయారు. కాగా పలువరు చిరు వ్యాపారులు తెచ్చిన కూరగాయలు, నిత్యావసర సరకుల కొనుగోలుకు జనం లేకపోవడంతో వారు ఇబ్బందులకు గురయ్యారు. సంతలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో

ఇళ్లకే పరిమితమవుతున్న ప్రజలు

మాడుగుల-రూరల్: మండలంలో ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ఉదయం తొమ్మిది నుంచే తీవ్రంగా ఉంటున్న భానుడి ప్రతాపం మధ్యాహ్నానికి మరింత అధికం కావడంతో బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. మండే ఎండకు తోడు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సాయంత్రం ఐదు గంటలు దాటినా ఎండ తీవ్రత తగ్గకపోవడంతో పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు ఇబ్బందులకు తీవ్ర గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండ ప్రభావంతో మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. మధ్యలో వర్షాలు కురుస్తున్నా ప్రయోజనం ఉండడం లేదని పలువురు పేర్కొంటున్నారు.



కోనాం సంతలో కొనుగోలుదారుల కోసం ఎదురుచూపులు

అప్పన్నకు రెండో విడత చందనం సమర్పణ



స్వామికి చందనం సమర్పిస్తున్న అర్చకులు

సింహాచలం, మే 23: వరాహలక్ష్మీనృసింహస్వామికి రెండో విడత చందన సమర్పణ గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు పూర్తి చేశారు. ఆలయ ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ అంతరాలయంలో మూలవిరాట్‌కు తొలుత చందన సమర్పణ చేసి, శీతలోపచారాలు ఇచ్చిన తరువాత నీరాజనాలు సమర్పించారు. ఆస్థాన మండపంలో స్థానాచార్యుల పర్యవేక్షణలో ప్రధానార్చకులు సారథ్యంలో అర్చక బృందం ఉత్సవమూర్తికి విశేషంగా పంచామృతాలతో, పలు రకాల పండ్ల రసాలు, పవిత్ర గంగధార జలాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం ఉత్సవమూర్తిని చందన కిరీటంతో అలంకరించి హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి, ఈఈ డీజీ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

కేజీబీవీ టీచర్ల పనితీరు మదింపు

- భవిత కేంద్రాల్లోని ప్రత్యేక ఉపాధ్యాయుల పనితీరు కూడా పరిశీలన
- విద్యా శాఖ ఆదేశం
- సమగ్ర శిక్షా అభియాన్ అధికారులకు బాధ్యత
- ప్రభుత్వం తీరుపై టీచర్లు అభ్యంతరం

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ) ఉపాధ్యాయులు, భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయుల పనితీరు మదింపు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. దీనిపై ఉపాధ్యాయులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. కేజీబీవీలు ఏర్పాటైన తరువాత ఎప్పుడూ లేని విధానాలను ఉన్నతాధికారులు అవలంబిస్తున్నారని అంటున్నారు. కేజీబీవీల్లో పనిచేసే కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్‌టీలు), భవిత కేంద్రాల్లోని ప్రత్యేక ఉపాధ్యాయులను ప్రతి ఏడాది విద్యా సంవత్సరంలో ఒకరోజు విరామంతో కొనసాగిస్తుంటారు. ఏడాదిలో ఒకరోజు మాత్రమే సర్వీస్ బ్రేక్ ఉంటుంది. ఈ ఏడాది గత నెల 24వ తేదీతో విద్యా సంవత్సరం ముగిసింది. ఒకరోజు ముందు అంటే 23వ తేదీతో వీరి సర్వీస్‌కు విరామం ఇచ్చిన అధికారులు తిరిగి జూన్ తొమ్మిదో తేదీ వరకూ మాత్రమే పొడిగింపు ఇచ్చారు. దీనిపై అప్పట్లోనే కేజీబీవీ టీచర్లంతా అనుమానం వ్యక్తంచేశారు. ఈనేపథ్యంలో కేజీబీవీ, భవిత కేంద్రాల్లో టీచర్ల పనితీరు మదింపు చేయాలని తాజాగా ఉన్నతాధికారులు నిర్ణయించి జిల్లాలకు ఆదేశించారు.

ఉమ్మడి జిల్లాలో 34 కేజీబీవీలలో సుమారు 700 మంది, వందకుపైగా భవిత కేంద్రాల్లో పనిచేసే సుమారు 100 మంది టీచర్ల పనితీరు మదింపు (20 మార్కులకు) బాధ్యతను సమగ్ర శిక్షా అభియాన్ అధికారులకు అప్పగించారు. దీనికి సంబంధించి ఫార్మెట్ కాపీలు వచ్చాయి. పనితీరు బాగాలేదన్న సాకుతో కొందరిని బయటకు పంపేందుకు ఉన్నతాధికారులు యత్నిస్తున్నారని ఉపాధ్యాయులు కొందరు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. గత ఏడాది తమ డిమాండ్ల సాధనకు కేజీబీవీ టీచర్లు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. దానిని గుర్తు పెట్టుకుని ఉన్నతాధికారులు ఇప్పుడు కక్షసాధింపునకు దిగుతారేమోనన్న ఆందోళనను వ్యక్తంచేస్తున్నారు. ఒకపక్క పనితీరు మదింపుపై కసరత్తు చేస్తున్న ఉన్నతాధికారులు మరోవైపు వేసవి సెలవులతో సంబంధం లేకుండా టెన్త్, ఇంటర్ తప్పిన విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహించే బాధ్యతను టీచర్లకు అప్పగించారు. సుమారు నెలరోజుల నుంచి ఈ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతిలో ప్రభుత్వ బడుల కంటే కేజీబీవీలు మెరుగైన ఫలితాలు సాధించాయని, ఉన్నతాధికారులు గమనించాలని వారు కోరుతున్నారు.

అనుమతులు లేకపోయినా రాకపోకలే!

- భారీ వాహనాలతో పరవాడ ప్రజలు బేజారు



పరవాడ రహదారిలో భారీ వాహనాల రద్దీ

పరవాడ, మే 23: మండల కేంద్రం పరవాడ ప్రధాన రహదారి గుండా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మునగపాక మండలం వెంకటాపురం వద్ద గల ఓ పరిశ్రమకు ముడిసరకును తరలించే భారీ వాహనాలన్నీ పరవాడ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రహదారి గుండా భారీ వాహనాలకు అనుమతులు లేకపోయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా వాహనదారులు వ్యవహరిస్తున్నారని ఈ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే కొన్నిచోట్ల ఇరుకు రోడ్లని ఇటువంటి పరిస్థితుల్లో జరగరానికి జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా భారీ వాహనాల వల్ల తరుచూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. రహదారి కూడా దెబ్బతింటుందని పలువురు వాపోతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి భారీ వాహనాల రాకపోకలను అరికట్టాలని అంతా కోరుతున్నారు.

వైభవంగా ముత్యాలమ్మ పండగ



పరవాడ, మే 23 : మండల కేంద్రం పరవాడ ప్రజల ఆరాధ్య దేవత ముత్యాలమ్మతల్లి (బ్రాహ్మణి) పండగ గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, పైలా రామచంద్రరావు, రెడ్డి శ్రీనివాసరావు, పైలా అప్పలనాయుడు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించి అనంతరం ఆలయం వద్ద అనుపోత్సవం జరిపారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది.

ఉప్పరాపల్లిలో పైడితల్లమ్మ జాతర



ఎస్.రాయవరం, మే 23 : ఉప్పరాపల్లిలో పైడితల్లమ్మ జాతరను గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు తొలుత అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాడనర్సాపురంలో దుర్గాలమ్మ వేడుక



రాంబిల్లి : మత్స్యకార గ్రామమైన వాడనర్సాపురంలో దుర్గాలమ్మ జాతరను గురువారం నిర్వహించారు. ఏడు గ్రామాల ఇలవేల్పుగా ఈ అమ్మవారు విరాజిల్లుతోంది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మొగలిపురంలో బంగారమ్మ అనుపోత్సవం

సబ్బవరం, మే 23 : మొగలిపురం గ్రామ ప్రజల ఆరాధ్య దేవత బంగారమ్మతల్లి వేడుకల్లో భాగంగా గురువారం అనుపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు జరిపారు. సాయంత్రం మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ అనుపోత్సవాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ గండి రవికుమార్, ఎడ్ల నాయుడు, ఐడీ బాబు, సిరపరపు కుమార్, నవీన్, రామదాసు, వసంతకుమార్, ప్రశాంత నాయుడు, సురేష్, చైత్యన తదితరులు దర్శించుకున్నారు.

కన్నుల పండువగా శ్రీనివాస కల్యాణం

- 'ఇంటింటా గోవిందుడు'లో భాగంగా రింగ్ రోడ్డులో నిర్వహణ
- భారీ సంఖ్యలో హాజరైన భక్తజనం



రింగు రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో శ్రీవారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, వేడుకల్లో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి టౌన్, మే 23 : పట్టణంలోని రింగు రోడ్డులో గల ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గురువారం 'ఇంటింటా గోవిందుడు' కార్యక్రమంలో భాగంగా శ్రీనివాస కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని ప్రతినిధి తిమ్మాపాత్రుని చక్రవర్తి ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా ఈ వేడుకను జరిపించారు. తొలుత కొణతాల సూరిఅప్పారావు ఇంటి వద్ద ముహూర్తపు రాట వేసి, విష్ణు సహస్రనామ పారాయణం జరిపారు. ఉదయం గరుడ వాహనంపై ఊరేగింపుగా ఉత్సవమూర్తులను ఫంక్షన్ హాల్‌కు తీసుకువచ్చి కల్యాణోత్సవం నిర్వహించారు. వేదపండితులు రమణాచార్యులు మంత్రోచ్ఛారణల నడుమ ఈ వేడుక జరిగింది. పట్టణానికి చెందిన 175 దంపతులు కల్యాణంలో కూర్చొన్నారు. అనంతరం అన్నసమారాధన జరిపారు.

నెల్లూరు నుంచి వచ్చిన అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని గురువులు పద్మాసని ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతిని కూడా ఈ సందర్భంగా ఘనంగా నిర్వహించారు. సాయంత్రం దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పట్టువస్త్రాలు, సారె, అన్నమయ్య విగ్రహంతో ఊరేగింపుగా ఫంక్షన్ హాల్‌కు వచ్చారు. రాత్రికి శ్రీవారి ఊంజల్ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కల్యాణోత్సవాన్ని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ తిలకించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, వైసీపీ నాయకులు డాక్టర్ కె.విష్ణుమూర్తి, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మంగవరంలో తిరు కల్యాణోత్సవం

పాయకరావుపేట రూరల్ : మండలంలోని మంగవరంలో కొలువుదీరిన పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి తిరు కల్యాణోత్సవాన్ని నేత్రపరంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు తమిడిశెట్టి బసవరాజు, తమిడిశెట్టి అయ్యారావుల ఆధ్వర్యంలో ఈ వేడుకను జరిపించారు. సుమారు వంద మంది దంపతులు కల్యాణోత్సవంలో కూర్చొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు వేడుకను వీక్షించారు. మాజీ సర్పంచ్‌లు వంగలపూడి రామారావు, ఎం.శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు కోనే రంగయ్య తదితరులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణ కమిటీ, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సీఎం రమేష్‌కు చిత్రపటం బహూకరణ

రామచంద్రమ్మకు సారె సమర్పణ



రామచంద్రమ్మకు సారెను ఊరేగింపుగా తెస్తున్న భక్తులు

ఎలమంచిలి, మే 23 : పట్టణంలో రామచంద్రమ్మ జాతర ఈ నెల 30వ తేదీన జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం అమ్మవారికి సారెను సమర్పించారు. తొలుత మహిళలు తమ ఇళ్లలో తయారు చేసి వివిధ రకాల పిండి వంటలను పళ్లాల్లో పేర్చారు. వాటిని తలపై పెట్టుకుని మేళతాళాలతో ఊరేగింపుగా ధర్మవరం, కాకివాని వీధి, సతకంపట్టు, తులసీనగర్, పాతవీధి, రామచంద్రమ్మ కాలనీ మీదుగా ఆలయానికి వెళ్లి నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి చేసి చూపిస్తాం

- టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల సమావేశాల్లో కొణతాల, పీలా



సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పీలా

కొత్తూరు, మే 23 : ప్రజల ఆశీస్సులతో అనకాపల్లితో పాటు రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో కూటమి విజయం సాధిస్తుందని మాజీ మంత్రి, అనకాపల్లి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్పష్టం చేశారు. అనకాపల్లి మండలం సత్యనారాయణపురం, మూలపేట, కొత్తూరు తదితర ప్రాంతాల్లో గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, బూత్ కమిటీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. కూటమి అధికారంలోకి రాగానే అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తామన్నారు. సత్యనారాయణపురం రైల్వే వంతెన సమస్యకు పరిష్కారం చూపుతామని వివరించారు. త్వరలో రాష్ట్రానికి, అనకాపల్లికి అన్నీ మంచి రోజులు రానున్నాయన్న ఆశాభావాన్ని పీలా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొత్తూరు, మే 23 : అనకాపల్లి మండలంలోని కొత్తూరు సెక్షన్ కార్యాలయం పరిధిలో ఉన్న 33/11 కేవీ, కశింకోట సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ ఫీడర్స్ వర్క్స్ కారణంగా శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని కశింకోట డివిజన్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ కారణంగా అనకాపల్లి మండలంలోని కొత్తూరు, పిసినికాడ, సత్యనారాయణ, మూలపేట, వేటజంగాలపాలెం, సంపతిపురం, వెంకుపాలెం, రొంగలివానిపాలెం, కుంచంగి, కూండ్రం, అలాగే, కశింకోట మండలం విస్సన్నపేట, రామన్నపాలెం గ్రామాల్లో సరఫరా ఉండదని వివరించారు.

చక్కానగర్ ఫీడర్ పరిధిలో..

పాయకరావుపేట : పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధి చక్కానగర్ ఫీడర్‌లో వార్షిక నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం నాలుగు గంటలు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఈ కారణంగా ఉదయం ఏడు నుంచి పదకొండు గంటల వరకు పాయకరావుపేటలోని పెదిరెడ్డి లక్ష్మీనగర్, దేవీనగర్, చక్కానగర్, ఆనంద్‌నగర్, శ్రీప్రకాష్ కాలేజీ ఏరియా, డొరకాలనీ, అలాగే మండలంలో పీఎల్‌పురం, నామవరం, సీతారాంపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం కలుగనుందని వివరించారు.

రాంబిల్లి ఫీడర్ పరిధిలో..

ఎలమంచిలి : ఇక్కడి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ రాంబిల్లి ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని విద్యుత్ శాఖ ఏఈ ఆపరేషన్స్ తెలిపారు. ఈ కారణంగా సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం, ఎలమంచిలి, యర్రవరం, కొత్తపాలెంలలో ఈ సౌకర్యం కలగనుందన్నారు.

వేంపాడు సబ్ స్టేషన్ పరిధిలో..

నక్కపల్లి : మండలంలోని వేంపాడు 33/11 సబ్‌స్టేషన్ పరిధిలోని కొన్ని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ (ఆపరేషన్స్) ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటినెన్స్ పనులు చేపడుతున్నందున ఉదయం పది నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు వేంపాడు, చినదొడ్డిగల్లు, రేబాక, డొంకాడ, నెల్లిపూడి, గునిపూడి, అమలాపురం, దోసలపాడు, గుల్లిపాడు, రమణయ్యపేట, ముకుందరాజుపేట, జగన్నాథపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

ఓట్ల లెక్కింపును నిబద్ధతతో చేపట్టాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, మే 23 : వచ్చే నెల నాలుగో తేదీన జరిగే ఓట్ల లెక్కింపును నిబద్ధతతో పాటు నిర్భయంగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనీలకు ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపులపై నిర్వహించిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. మాన్యువల్‌లో సూచించిన ప్రకారం ఓటు చెల్లుబాటును గుర్తించాల్సి ఉంటుందన్నారు. ముందుగా ఈవీఎంలను పరిశీలించి పోలైన ఓట్లను సరిచూడాలన్నారు. తరువాత సాంకేతికపరమైన అంశాలను సరిచూసి ఆ పై లెక్కింపునకు వెళ్లాలని వివరించారు. ఎటువంటి తడబాటుకు అవకాశం ఇవ్వరాదన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు, ఈవీఎంల లెక్కింపు పైన కూడా అందరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఆర్‌వో దయానిధి, డీపీవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

తాగు నీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

- కశింకోట మండల సమావేశంలో సభ్యులు వినతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట, మే 23 : మండలంలోని పలు గ్రామాల్లో తాగు నీరు, విద్యుత్ సమస్య పరిష్కరించాలని సర్పంచ్‌లు కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కశింకోట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన జరిగింది. చెరకాం గ్రామంలో తాగునీరు, విద్యుత్ సమస్య ఉందని, 24 గంటల విద్యుత్ సరఫరా కావడం లేదని సర్పంచ్ వెన్నెల చినదేముళ్ళు తెలిపారు. జె.తుని సర్పంచ్ కోన అరుణ మాట్లాడుతూ పంచాయతీలో పూర్తి చేసిన భవనానికి బిల్లులు చెల్లించాలని కోరారు. అనంతరం ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని చెప్పారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సీఐ వినోద్‌బాబు మాట్లాడుతూ 144వ సెక్షన్, 30 పోలీసు యాక్టు అమలులో ఉన్నందున సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో గెలిచిన పార్టీలు సంబరాలు చేయకూడదని తెలిపారు. ప్రజాప్రతినిధులకు చెందిన అనుచరులను తమకు అనుగుణంగా కంట్రోల్ చేసుకోవాలని కోరారు. మండలమంతా ప్రశాంతంగా ఉందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శేషుబాబు, ఎంఈవో చిట్టిబాబు, సీడీపీవో ప్రభావతి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గొల్ల విల్లి శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షురాలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా గణేష్, పలు గ్రామాలు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కూండ్రంలో మరోసారి గడ్డికుప్ప దగ్ధం

కొత్తూరు, మే 23 : అనకాపల్లి మండలం కూండ్రంలో మరోసారి గడ్డికుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని గ్రామ పాడి రైతులు గురువారం తెలిపారు. దీంతో ఇది 26వ అగ్ని ప్రమాదంగా వారు వాపోతున్నారు. గురువారం తెల్లవారుజామున ఐదు గంటలకు గొర్లి ఆదినారాయణకు చెందిన గడ్డికుప్పను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారని తెలిపారు.

కోట్లలో వ్యయం.. నీరుగారిన లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

మాత్రమే సామర్థ్యం కలిగినవి. పూర్తిస్థాయిలో నీరు అందాలంటే మరో 8 లక్షల సామర్థ్యం కలిగిన నీళ్ల ట్యాంకులు ఏర్పాటు చేయాలి. లేదంటే ఇవే ట్యాంకుల ద్వారా రోజూ రెండుపూటలా నీరు అందిస్తే తప్ప స్థానికుల నీటి అవసరాలు తీరవు. కాగా తమ పంచాయతీల పరిధిలో పథకాన్ని నిర్మించారంటూ దీని నీళ్లను ఆయా పంచాయతీల పాలకులు మళ్లించడం వల్ల కూడా చోడవరం వాసులు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నట్టు తెలిసింది. దీనికి తోడు పలువురు మోటార్లతో అక్రమంగా కొళాయి నీరును తోడేస్తుండడం వల్ల కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

దీనిపై చోడవరం ఈవో బి.నారాయణరావు వివరణ కోరగా జన్నవరం నీటి పథకం ద్వారా వచ్చే నీరు పూర్తిగా అందితే సమస్య ఉండేది కాదన్నారు. అలాగే మోటార్ల ద్వారా నీటి చౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఓటర్లకు డబ్బులు ఇచ్చారా?.. నొక్కేశారా?

... 5వ పేజీ తరువాయి

అనుకొని ఉన్న మరో పంచాయతీ (గాజువాక రోడ్డు)లో తమకు అనుకూలమైన వారికే వైసీపీనాయకులు డబ్బులు పంపిణీ చేశారు. అయితే కూటమి నాయకులు మాత్రం అందరికీ పంపిణీ చేశారన్న చర్చ జరుగుతోంది. మండలంలో అతిపెద్ద మత్స్యకార్ల గ్రామమైన పూడిమడకలో కూడా వైసీపీ నాయకులు సక్రమంగా పంపిణీ చేయలేదన్న చర్చ కొనసాగుతోంది. ఇక్కడ ఓటరు స్లిప్ ఉన్న వారికి మాత్రమే డబ్బులు పంపిణీ చేశారు. ఓటరు స్లిప్‌పై గ్రామ పంచాయతీ స్టాంప్ వేసి దానిని సెల్‌లో ఫొటో తీసి పంపిణీ చేశారు. ఈ గ్రామంలో 8,600 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ చాలా మందికి రూ.1000 చొప్పునే అందాయి. అంతేకాక పూర్తిగా పంపిణీ కూడా చేయలేదని అంటున్నారు. ఇదే విధంగా ప్రతి పంచాయతీలోని నాయకులు చేతి వాటం ప్రదర్శించారు. కాగా పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత సర్పంచులు అప్పులు చేసి అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేశారు. కానీ చేసిన పనులకు బిల్లులు రాలేదు సరికదా పంచాయతీ ఖాతాల్లో ఉన్న నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం తీసేసుకుంది. దీంతో చాలా మంది సర్పంచులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. ఈ ఎన్నికలు వీరికి లాటరీ తగిలినట్టయిందన్న చర్చ సాగుతోంది. అంతేకాక వైసీపీ సర్పంచుల్లో చాలా మంది ప్రభుత్వంపై అసమ్మతితో ఉన్నారు. ఈసారి ఎలాగూ ప్రభుత్వం అధికారంలోకి రాదని భావించి కూడా అందిన కాడికి నొక్కేశారని అనుకుంటున్నారు

అధికార పార్టీకి అసమ్మతి దెబ్బ

నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు డబ్బు సక్రమంగా పంచకపోవడం ఒక ఎత్తయితే, అసమ్మతి మరో ఎత్తయింది. ఎలమంచిలి నియోజకవర్గంలో వైసీపీ రెండు వర్గాలుగా చీలిపోయింది. ఒకటి కన్నబాబురాజు వర్గం కాగా, మరొకటి గవర కార్పొరేషన్‌ఛైర్మన్ బొడ్డేడ ప్రసాద్ వర్గం. దీంతో నియోజక వర్గంలో ఎన్నికలకు ముందే బొడ్డేడ వర్గానికి చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు జనసేన, టీడీపీ, బీజేపీలోకి వలసలు వెళ్లిపోయారు. ఇక మునగపాకకు చెందిన బొడ్డేడ ప్రసాద్ ఎన్నికల్లో మునగపాక మండలంలో ఉండకుండా పాయకరావుపేట నియోజక వర్గంలో పరిశీలకునిగా వెళ్లారు. దీంతో నియోజక వర్గంలోని బొడ్డేడ వర్గం అధికార పార్టీకి దూరంగా ఉందన్న చర్చ జరుగుతోంది. నియోజకవర్గంలో అభ్యర్థుల గెలు పోటములపై బెట్టింగ్‌లో జోరుగా సాగుతున్నాయి. కూటమి అభ్యర్థి విజయంపైనే ఎక్కువగా పందేలు కాస్తు న్నారని, వైసీపీ అభ్యర్థిపై కాయడం లేదని తెలిసింది.

గండి బాబ్జీని పరామర్శించిన బండారు



బాబ్జీతో మాట్లాడుతున్న బండారు

సబ్బవరం, మే 23 : మాజీ ఎమ్మెల్యే, పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీని ఆయన స్వగ్రామం మొగలిపురంలో గురువారం మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. బాబ్జీ ఇటీవల అనారోగ్యం బారినపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా అతనిని బండారు పరామర్శించి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. ఇటీవల జరిగిన పోలింగ్ సరళి, తదితర రాజకీయ అంశాలపై చర్చించుకున్నారు. బండారు వెంట టీడీపీ జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పీవీవీఎస్ఎన్ రాజు, గండి దేముడు, దొడ్డి ప్రకాశ్, కొటాన అప్పారావు, తమరాన బంగారు నాయుడు, కొరాడ శ్రీను ఉన్నారు.

ఘనంగా లలితాంబిక ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న రత్నాకర్, నాగజగదీష్

అనకాపల్లి టౌన్, మే 23 : పట్టణంలోని పరమేశ్వరి పార్కు సెంటర్ వద్ద కొలువైన లలితాంబిక అమ్మవారి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలతో ఆలయ ప్రధానార్చకులు రామచరణ్ శర్మ అమ్మవారికి కుంకుమార్చనలు జరిపించారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శులు దాడి రత్నాకర్, బుద్ద నాగజగదీశ్వరరావులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు బుద్ద కుమార్, బుద్ద సతీష్ కుమార్, చదరం వెంకటరావు, కర్రి నూకరాజు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

త్రిపురాంతక, సర్వమంగళాంబ కల్యాణం



కల్యాణాన్ని జరుపుతున్న అర్చకస్వాములు

కశింకోట, మే 23 : స్థానిక పెద్దబజారు శివాలయంలో త్రిపురాంతక స్వామి, సర్వమంగళాంబ అమ్మవార్ల కల్యాణాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు వెలవలపల్లి బాబ్జీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు జరిపారు. సాయంత్రం ఆరు గంటల నుంచి 108 మంది దంపతులతో స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు.

కంప్యూటర్ వినియోగంపై విద్యార్థులకు శిక్షణ

పాయకరావుపేట, మే 23 : ఇక్కడి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో విద్యార్థులకు గురువారం కంప్యూటర్ వినియోగం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.సీతారామమూర్తి విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, ఇంగ్లీషు, హిందీ పదాలు చదవడం, రాయడం, నేర్పారు. ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు, విశ్రాంతం ఉపాధ్యాయులు సీతారామయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంగ్లీషు గ్రామర్‌పై అవగాహన

సబ్బవరం, మే 23 : వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఇక్కడి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం పేపర్ రీడింగ్‌తో పాటు ఇంగ్లీష్ గ్రామర్, స్వాతంత్ర్య సమర యోధుల జీవిత చరిత్రపై ఉపాధ్యాయులు రత్నకుమార్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులతో పాటు గ్రంథాలయాధికారిని వి.శిరీష పాల్గొన్నారు.

'గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి'

పాయకరావుపేట, మే 23 : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.స్వప్న పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యదర్శులతో గురువారం ఇక్కడ సమావేశం నిర్వహించి గ్రామాల్లో తాగునీటి సరఫరా, సంపద కేంద్రాల నిర్వహణ, పారిశుధ్య సమస్య తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. అనంతరం ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్‌తో కలిసి పట్టణంలోని సంపద కేంద్రాన్ని పరిశీలించారు. కార్యదర్శులు జె.చంద్రశేఖర్, వైవీ.సత్యనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య'



దార్లపూడిలో తల్లిదండ్రులను కలిసిన ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం, మే 23 : మండలంలోని దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్త అడ్మిషన్లపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా గురువారం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కలిశారు. హెచ్ఎం రమణశ్రీ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, విద్యా బోధన తదితర అంశాలపై వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య అందుతుందన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి

అనకాపల్లి టౌన్, మే 23 : సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో గురువారం ఇక్కడ బుద్ధ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధుని చిత్రపటానికి ఎంపీ సత్యవతి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బొజ్జన్నకొండ చరిత్ర.. విశిష్టత అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ వార్షికోత్సవం

అనకాపల్లి టౌన్, మే 23 : సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం పదో వార్షికోత్సవాన్ని గురువారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు రాష్ట్ర కార్యదర్శి బందం పైడిరాజు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

ఎలమంచిలి, మే 23 : మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు రాయితీపై అందించేందుకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు మండల వ్యవసాయాధికారి మోహన్‌రావు గురువారం తెలిపారు. వంద క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. యాభై శాతం రాయితీపై రైతులకు అందిస్తామన్నారు. వీటి కోసం రైతులు పాస్ పుస్తకం, ఆధార్ నంబరుతో వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే, వరి విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఆర్‌జీఎల్ రకం 2537తో పాటుగా కొత్త రకం ఎంటీయూ 1318, 1061, 1224, 7026 విత్తనాలు సబ్సిడీపై అందించనున్నట్టు చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

చిత్రలేఖనంతో సృజనాత్మకత

నక్కపల్లి , మే 23 : చిత్రలేఖనం పోటీల ద్వారా పిల్లల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తి పెరుగుతుందని చిన దొడ్డిగల్లు హైస్కూల్ రవీంద్రనాథ్ ఠాగూర్, అంగ్ల క్లబ్ వ్యవస్థాపకుడు యేడిద వెంకట రమణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం గ్రంథాలయాధికారి కె.జనార్దన్ ఆధ్వర్యంలో పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని చూసి అభినందించారు.

వీరబ్రహ్మంగారి ఆలయ వార్షికోత్సవం

మాకవరపాలెం, మే 23: మండల కేంద్రంలో వీరబ్రహ్మంగారి ఆలయం మొదటి వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమర్చానలు నిర్వహించారు. అలాగే తెల్లవారు జాము నుంచి గుడి వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం గుడి వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం బ్రహ్మంగారి విగ్రహాన్ని గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పంతం ఆదినారాయణ, కార్యదర్శి ఆరిపాక శ్రీను, కోశాధికారి మానేపల్లి నాగేశ్వరావు, భక్తులు పాల్గొన్నారు.

రైతు ఫిర్యాదుపై ఎంపీడీవో విచారణ

గొలుగొండ, మే 23: విత్తనాల విషయమై ఓ రైతు డివిజనల్ ఎన్నికల అధికారికి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీడీవో రత్నకుమారి గురువారం విచారణ చేపట్టారు. రైతు చిటికెల వరహాలబాబు పచ్చిరొట్ట విత్తనాలు అవసరమని ముందస్తుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు అందించారని విచారణలో చెప్పినట్టు ఎంపీడీవో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే వరహాలబాబుకు విత్తనాలు పంపిణీ చేశామని వ్యవసాయాధికారి సుధారాణి లిఖితపూర్వకంగా ఇచ్చిన వివరణను, డివిజనల్ ఎన్నికల అధికారికి అందించినట్టు ఎంపీడీవో తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

కృష్ణాదేవిపేట, మే 23: గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట ప్రభుత్వం జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి జరగనున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చీఫ్ సూపరింటెండెంట్ రుత్తల గంగరాజు తెలిపారు. గొలుగొండ గురుకుల, కస్తూర్బాగాంధీ విద్యాలయం, కృష్ణాదేవిపేట కళాశాలలతో పాటు పలు ప్రైవేటు కళాశాలల నుంచి 350 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. మాస్‌కాపీయింగ్ జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టామని ఆయన చెప్పారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి

గొలుగొండ, మే 23: విద్యార్థులు గ్రంథాలయాలను విద్యా పరంగా వినియోగించుకోవాలని రిటైర్డ్ ప్రథమశ్రేణి గ్రంథాలయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం పర్యావరణ పర్యవేక్షణపై వ్యాచరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని చెప్పారు. వీటిని విద్యార్థులు సక్రమంగా వినియోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రాజుబాబు పాల్గొన్నారు.

పారిశుధ్యం.. అధ్వానం

- ఏఎల్ పురంలో రహదారి, ఇళ్ల మధ్య ఏరులై పారుతున్న మురుగునీరు
- వాహన చోదకులు, పాదచారులు అగచాట్లు... పట్టించుకోని అధికారులు



ఏఎల్ పురం హైస్కూల్ వీధిలో రహదారిపై ఏరులై పారుతున్న మురుగు నీరు



ఏఎల్ పురం బీసీ కాలనీలో ఇళ్ల మధ్య పేరుకుపోయిన మురుగు

కృష్ణాదేవిపేట, మే 23: ఏఎల్ పురంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. రహదారులపై మురుగు నీరు ఏరులై పారుతోంది. ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తున్నది. దీంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా పాదచారులు, వాహన చోదకులు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలోని బీసీ కాలనీ, హైస్కూల్‌లో రోడ్డు, ఎస్సీ కాలనీ, గొల్లపేట, ఎస్టీ కాలనీలో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఈ మురుగు నీరు మధ్యలో నుంచే ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అలాగే వాహన చోదకులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వలతో దోమలు వ్యాప్తి చెందటంతో పాటు దుర్వాసనలు వెదజల్లుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు పంచాయతీ, పాలకులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోనే నాథులే కరువైయ్యారని ప్రజలు వాపోతున్నారు. సుమారు 20 వేల మంది జనాభా కలిగిన ఈ గ్రామంలో పది మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరు ప్రధాన రహదారిపై చెత్తసేకరణకే పరిమితమవుతున్నారు. పంచాయతీలో రెండు వేల ఇళ్లు ఉండగా, ఏడాదికి సుమారు రూ.15 లక్షలు ఇంటి పన్నులు వస్తుంటాయి. ఇటువంటి పంచాయతీలో పారిశుధ్యం దారుణంగా ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడం సరికాదని స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి ఏఎల్ పురం పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని వారు కోరుతున్నారు.

కోట్లలో వ్యయం.. నీరుగారిన లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

మాత్రమే సామర్థ్యం కలిగినవి. పూర్తిస్థాయిలో నీరు అందాలంటే మరో 8 లక్షల సామర్థ్యం కలిగిన నీళ్ల ట్యాంకులు ఏర్పాటు చేయాలి. లేదంటే ఇవే ట్యాంకుల ద్వారా రోజూ రెండుపూటలా నీరు అందిస్తే తప్ప స్థానికుల నీటి అవసరాలు తీరవు. కాగా తమ పంచాయతీల పరిధిలో పథకాన్ని నిర్మించారంటూ దీని నీళ్లను ఆయా పంచాయతీల పాలకులు మళ్లించడం వల్ల కూడా చోడవరం వాసులు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నట్టు తెలిసింది. దీనికి తోడు పలువురు మోటార్లతో అక్రమంగా కొళాయి నీరును తోడేస్తుండడం వల్ల కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనిపై చోడవరం ఈవో బి.నారాయణరావు వివరణ కోరగా జన్నవరం నీటి పథకం ద్వారా వచ్చే నీరు పూర్తిగా అందితే సమస్య ఉండేది కాదన్నారు. అలాగే మోటార్ల ద్వారా నీటి చౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఓటర్లకు డబ్బులు ఇచ్చారా?.. నొక్కేశారా?

... 5వ పేజీ తరువాయి

అనుకొని ఉన్న మరో పంచాయతీ (గాజువాక రోడ్డు)లో తమకు అనుకూలమైన వారికే వైసీపీనాయకులు డబ్బులు పంపిణీ చేశారు. అయితే కూటమి నాయకులు మాత్రం అందరికీ పంపిణీ చేశారన్న చర్చ జరుగుతోంది. మండలంలో అతిపెద్ద మత్స్యకార్ల గ్రామమైన పూడిమడకలో కూడా వైసీపీ నాయకులు సక్రమంగా పంపిణీ చేయలేదన్న చర్చ కొనసాగుతోంది. ఇక్కడ ఓటరు స్లిప్ ఉన్న వారికి మాత్రమే డబ్బులు పంపిణీ చేశారు. ఓటరు స్లిప్‌పై గ్రామ పంచాయతీ స్టాంప్ వేసి దానిని సెల్‌లో ఫొటో తీసి పంపిణీ చేశారు. ఈ గ్రామంలో 8,600 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ చాలా మందికి రూ.1000 చొప్పునే అందాయి. అంతేకాక పూర్తిగా పంపిణీ కూడా చేయలేదని అంటున్నారు. ఇదే విధంగా ప్రతి పంచాయతీలోని నాయకులు చేతి వాటం ప్రదర్శించారు. కాగా పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత సర్పంచులు అప్పులు చేసి అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేశారు. చాలా మంది సర్పంచులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నా, ఈ ఎన్నికలు వీరికి లాటరీ తగిలినట్టయిందన్న చర్చ సాగుతోంది. ఈసారి ఎలాగూ ప్రభుత్వం రాదని భావించి సర్పంచులు అందినకాడికి నొక్కేశారని తెలిసింది.

అధికార పార్టీకి అసమ్మతి దెబ్బ

అధికార పార్టీ నాయకులు డబ్బులు సక్రమంగా పంచకపోవడం ఒక ఎత్తయితే, అసమ్మతి మరో ఎత్తయింది. నియోజకవర్గంలో వైసీపీ రెండు వర్గాలుగా చీలిపోయింది. ఒకటి కన్నబాబురాజు వర్గం కాగా, మరొకటి గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ వర్గం. దీంతో నియోజక వర్గంలో ఎన్నికలకు ముందే బొడ్డేడ వర్గానికి చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు జనసేన, టీడీపీ, బీజేపీలోకి వలసలు వెళ్లిపోయారు. ఇక మునగపాకకు చెందిన బొడ్డేడ ప్రసాద్ ఎన్నికల్లో పాయకరావుపేటకు పరిశీలకునిగా వెళ్లారు. దీంతో నియోజకవర్గంలోని బొడ్డేడ ప్రసాద్ వర్గం అధికార పార్టీకి దూరంగా ఉందన్న చర్చ జరుగుతోంది. కాగా కూటమి అభ్యర్థి విజయంపైనే పందేలు కాస్తున్నారని, వైసీపీ అభ్యర్థిపై బెట్టింగ్‌లు కాయడం లేదని తెలిసింది.

లింగంపేటలో దోమల నివారణ మందు పిచికారీ



ఓ ఇంటిలో దోమల మందు పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

కృష్ణాదేవిపేట, మే 23: గొలుగొండ మండలం లింగంపేట గ్రామంలో దోమల నివారణ స్ప్రెయింగ్ గురువారం గొలుగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికీ చేపట్టారు. అలాగే వైద్య సిబ్బంది గ్రామంలో జ్వరాలు, ఇతర రోగాల బారిన పడిన రోగుల ఇంటింటికీ వెళ్లి రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. అనారోగ్యబారిన పడితే వెంటనే ప్రభుత్వం వైద్యశాలలో వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఫకీర్ నాయుడు, జయకృష్ణ,ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

- పశు సంవర్ధక శాఖ డీడీ నరసింహులు



మేకలకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారులు

మాకవరపాలెం, మే 23: సీజనల్ వ్యాధులు రాకుండా గొర్రెలు, మేకలకు టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ పాడేరు డిప్యూటీ డైరెక్టర్ ఎన్.నరసింహులు తెలిపారు. మండలంలోని తామరం, ఎరకన్నపాలెంలో గురువారం పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రక్రియ 20 రోజుల పాటు అన్ని ప్రభుత్వ పశువుల ఆస్పత్రుల పరిధిలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మండలంలో ఇప్పటివరకు 450 గొర్రెలు, మేకలకు టీకాలు వేసినట్టు ఆయన తెలిపారు. ప్రతీ గ్రామంలోనూ ఈ టీకాల కార్యక్రమం జరుగుతున్నదని, గొర్రెల కాపరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి అనిల్‌కుమార్, అసిస్టెంట్లు రామ్మోహన్, అప్పలనాయుడు, గోపాలమిత్ర నారాయణమూర్తి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవం

నర్సీపట్నం, మే 23: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ఉద్యోగ విజయోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జీవీ రామచంద్రరావు ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరంలో ఉద్యోగాలు సాధించిన 56 మంది విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. అమర్ రాజా బ్యాటరీ, డైకిన్, రెలియబుల్ టెక్నో సిస్టమ్స్, వీల్స్ ఇండియా కంపెనీ, హెచ్‌ఎల్ ఆనంద్ మెన్‌డో, ఆల్‌స్ట్రామ్ శ్రీసిటి, వీరభద్ర మినరల్స్, టైచె డైకాస్టింగ్ కంపెనీలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్ ఎంవీ రత్నప్రసాద్, జల వనరుల శాఖ డీఈ ఎం రాజేంద్రప్రసాద్, ఎం.రామస్వామి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘణపై ఫిర్యాదు

నర్సీపట్నం అర్బన్, మే 23: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వ్యవసాయాధికారి, ఆర్బీకే ఎంపీఈవోపై చర్యలు చేపట్టాలని జోగంపేట మాజీ సర్పంచ్ సుర్ల సీతారామ్మూర్తి ఫిర్యాదు చేశారు. ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ ఎన్నికల డీటీ శివకు గురువారం ఫిర్యాదు అందించారు. గొలుగొండ మండలంలో జోగంపేట గ్రామ సచివాలయంలోని ఆర్‌బీకే కేంద్రంలో ఈ నెల 22వ తేదీన పచ్చిరొట్ట విత్తనాలను మాజీ సర్పంచ్ చిటికెల వరహాలబాబు చేతులమీదుగా రైతులకు పంపిణీ చేశారని, ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొన్నారు. కోడ్ ఉల్లంఘించిన వ్యవసాయాధికారి, ఆర్‌బీకే ఎంపీఈవోపై చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో వారు కోరారు.

వాలాబు రహదారిలో అడుగడుగునా గోతులు

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు



గోతులమయమైన రహదారి

దేవరాపల్లి, మే 23: దేవరాపల్లి వాలాబు రహదారిలో అడగడుగునా ఉన్న గోతులు ప్రమాదభరితంగా మారాయి. దేవరాపల్లి నుంచి వాలాబు, తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డులో పెద్దపెద్ద గోతులు ఉండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ పంచాయతీకి చెందిన 14 శివారు గ్రామాలు, అనంతగిరి మండలానికి చెందిన ఐదు గ్రామాల గిరిజనులు ఈ రహదారి గుండానే నిత్యవసరాలతో పాటు ఇతర అవసరాల కోసం దేవరాపల్లికి రాకపోకలు సాగిస్తుంటారు. దేవరాపల్లి నుంచి 15 కిలోమీటర్ల మేర ఈ రహదారి గోతులమయంగా మారడంతో తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని పలువురు వాపోతున్నారు. గోతుల మూలంగా రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా సరియా వాటర్ ఫాల్స్‌కు వెళ్లాలన్నా పర్యాటకులు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగించేందుకు నానాపాట్లు పడుతున్నారు. అందువల్ల అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టవలసిందిగా గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.



శతకంపట్టు వద్ద పూజలందుకుంటున్న మోదకొండమ్మ

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల, మే 23: మాడుగుల గ్రామ ఇలవేల్పు మోదకొండమ్మ అమ్మవారికి స్థానిక శతకంపట్టు వద్ద నిత్యపూజలు అందుతున్నాయి. జూన్ 18న జరగనున్న అమ్మవారి జాతర సందర్భంగా ఈ నెల 21న మోదకొండమ్మను ఊరేగింపుగా తీసుకువచ్చి రాజులకోట శతకంపట్టు వద్ద ఉంచారు. నెల రోజుల పాటు శతకంపట్టు వద్ద కొలువుండే అమ్మవారికి రోజువారి పూజాది కార్యక్రమాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికం సంఖ్యలో విచ్చేసి మోదకొండమ్మను దర్శించుకుని ముడుపులు చెల్లించారు.

వైభవంగా మరిడితల్లి పండుగ

బుచ్చెయ్యపేట, మే 23: అయితంపూడిలో గురువారం మరిడితల్లి పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయగా స్థానికులతో పాటు బుచ్చెయ్యపేట, కొండపాలెం, కేపీ అగ్రహారం, పెదమదీన గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.



నీలంపేటలో ట్రాక్టర్‌ను పట్టుకున్న రెవెన్యూ సిబ్బంది

అనుమతి లేకుండా మట్టి, గ్రావెల్ తరలిస్తే చర్యలు

చీడికాడ, మే 23: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి లేదా గ్రావెల్‌ను తరలిస్తే సంబంధిత వాహనదారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చీడికాడ తహసీల్దార్ కార్యాలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణంరాజు హెచ్చరించారు. మండలంలోని నీలంపేట గ్రామంలో గురువారం ఒక చెరువు నుంచి దేవరాపల్లి మండలం వాకపల్లి గ్రామానికి చెందిన బి.తాతారావు అనే వ్యక్తి ట్రాక్టర్‌తో మట్టిని తరలిస్తుండగా అర్జునగిరి సచివాలయ వీఆర్‌వో స్థానిక వీఆర్‌ఏతో కలిసి పట్టుకున్నారు. సంబంధిత ట్రాక్టర్‌ను చీడికాడ పోలీస్ స్టేషన్‌కు అప్పగించామని కృష్ణంరాజు తెలిపారు.

నేడు రాజకీయ పార్టీల నాయకులతో ఎస్పీ సమావేశం

రావికమతం, మే 23: చోడవరం నియోజకవర్గ రాజకీయ నాయకులతో అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించనున్నట్టు రావికమతం ఎస్‌ఐ ధనుంజయనాయుడు తెలిపారు. స్థానిక తిరుమల (గర్నికం) కల్యాణ మండపంలో ఉదయం పది గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో రావికమతంతోపాటు చోడవరం, బుచ్చెయ్యపేట, రోలుగుంట మండలాలకు చెందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశానికి నాయకులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

తుఫాన్ బాధిత రైతులకు రూ.91 లక్షలు విడుదల

రోలుగుంట, మే 23: గత ఏడాది డిసెంబరులో సంభవించిన మిచాంగ్ తుఫాన్ పంట నష్ట పరిహారం కింద మండలంలోని 24 పంచాయతీలకు సంబంధించి 1923 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 531 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని, ఆయా రైతులకు ప్రభుత్వం రూ.91 లక్షల నిధులను విడుదల చేసి వారి ఖాతాల్లో జమ చేసిందని పేర్కొన్నారు.



బుద్ధుని విగ్రహానికి పూలమాల వేసి ప్రార్థనలు చేస్తున్న దిబ్బిడి గ్రామస్థులు

ఘనంగా బుద్ధ పూర్ణమి వేడుకలు

బుచ్చెయ్యపేట, మే 23: బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని దిబ్బిడిలో బుద్ధుని విగ్రహానికి పూలమాల వేసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, చిన్నారులు పాల్గొన్నారు. అలాగే వడ్డాది శ్రీరాఘవేంద్ర ఐటీఐ కళాశాలలో అతిథిదేవోభవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుద్ధుని చిత్రపటానికి పూలమాల వేసి ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కోరికలే మానవుని దుఃఖానికి కారణమన్న బుద్ధుని బోధనలను అందరూ పాటించాలన్నారు. కార్య క్రమంలో కళాశాల ప్రతినిధులు గొన్నాబత్తుల శ్రీనివాసరావు, ఎ.కామేశ్వరరావు, ఈశ్వరరావు, జి.సత్యనారాయణ, గంగరాజు, గురునాథ్, తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో వృద్ధురాలికి నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

85 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

కె.కోటపాడు, మే 23: ఇక్కడి జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద గురువారం అనకాపల్లి అంధత్వ నివారణ సంస్థ, విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, స్థానిక వాసవి క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో 85 మందికి నేత్ర పరీక్షలు చేయగా, 35 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు వినకోట ఆనందరావు, కార్యదర్శి కోట్ల రాంబాబు, కోశాధికారి మామిడి రమణాజీ, శంకర్ ఫౌండేషన్ డాక్టర్ మధులిక, ఆప్తాలమిక్ ఆఫీసర్ హరిచందన, కో-ఆర్డినేటర్ సీహెచ్ అశ్వనికుమార్, దీపిక, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

ఎలమంచిలి, మే 23 : మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు రాయితీపై అందించేందుకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు మండల వ్యవసాయాధికారి మోహన్‌రావు గురువారం తెలిపారు. వంద క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. యాభై శాతం రాయితీపై రైతులకు అందిస్తామన్నారు. వీటి కోసం రైతులు పాస్ పుస్తకం, ఆధార్ నంబరుతో వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే, వరి విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఆర్‌జీఎల్ రకం 2537తో పాటుగా కొత్త రకం ఎంటీయూ 1318, 1061, 1224, 7026 విత్తనాలు సబ్సిడీపై అందించనున్నట్టు చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

కంప్యూటర్ వినియోగంపై శిక్షణ

పాయకరావుపేట, మే 23 : మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలోవేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు గురువారం కంప్యూటర్ వినియోగం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.సీతారామమూర్తి విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, ఇంగ్లీషు, హిందీ పదాలు చదవడం, రాయడం, నేర్పారు. ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు, విశ్రాతం ఉపాధ్యాయులు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

'బెల్టు షాపుల నిర్వహణకు అధికారులే సహకరిస్తున్నారు'

మాడుగుల, మే 23: బెల్టు షాపుల నిర్వహణకు సంబంధించి ఆ శాఖ అధికారులే సహకరిస్తున్నారని గ్రామానికి చెందిన వార్డు మెంబర్ సమ్మంగి జగన్ ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ స్థానిక ఎస్‌ఈబీ స్టేషన్ సమీపంలో బెల్టు షాపు నడుస్తుందని, దీనికి సంబంధిత స్టేషన్ సిబ్బంది సహకరిస్తున్నట్టు అధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయాన్ని ఎస్‌ఈబీ ఎస్‌ఐ హనుమంత్ వద్ద ప్రస్తావించగా, గతంలో అందిన ఫిర్యాదు మేరకు మందలించామని, మళ్లీ పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

వేసవిలో ద్రవ పదార్థాలను అధికంగా తీసుకోవాలి

చీడికాడ, మే 23: వేసవి కాలం ముగిసేంత వరకు ప్రజలందరూ ద్రవ పదార్థాలను అధికంగా తీసుకోవాలని చీడికాడ పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరావు సూచించారు. మండలంలోని కోనాం సబ్ సెంటర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది రోగులను పరీక్షించి వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ మొల్లి వరలక్ష్మి, ఏఎన్‌ఎం రాజేశ్వరి, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే విజ్ఞానం పెంచుకోవాలి

రోలుగుంట, మే 23: విద్యార్థి దశ నుంచే అందరూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయాధికారి వరలక్ష్మి అన్నారు. రోలుగుంట శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె విద్యార్థులకు నీతి కథలు, పద్యాలు, శ్లోకాలు, స్పోకెన్ ఇంగ్లిష్, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. జూన్ ఏడో తేదీ వరకు జరిగే ఈ శిక్షణ శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

బీసీ సంక్షేమ సంఘ వార్షికోత్సవం

అనకాపల్లి టౌన్, మే 23 : సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం పదో వార్షికోత్సవాన్ని గురువారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు రాష్ట్ర కార్యదర్శి బంధం పైడిరాజు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.